క్లుప్తంగా

స్టెమి ప్రాజెక్టు అధ్యయనానికి డాక్టర్ చంద్రశేఖర్



కర్నూలు(హాస్పిటల్): తమిళనాడులో గుండెపోటు మరణాలను తగ్గించేందుకు నిర్వహిస్తున్న స్టెమి ప్రాజెక్టును అధ్యయనం చేసేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియాలజి హెచ్‌వోడీ డాక్టర్ పి. చంద్రశేఖర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆయనతో పాటు ఏపీ స్టెమి ప్రాజెక్టు నోడల్ అధికారి, కార్డియాలజిస్టు డాక్టర్ ఎన్. శ్రీకాంత్, స్పెషల్ ఆఫీసర్, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ మునీశ్వరరెడ్డి, వైజాగ్‌కు చెందిన కార్డియాలజి ప్రొఫెసర్ డాక్టర్ మల్లాది శ్రీనివాసరావు, వరల్డ్‌బ్యాంక్ ప్రాజెక్ట్ కన్సల్టెంట్ దేవరాజ్ ఈ బృందంలో ఉన్నారు. ఈ బృందం సభ్యులు ఈ నెల 3, 4వ తేదిల్లో తమిళనాడు వెళ్లి స్టెమి ప్రాజెక్టును అధ్యయనం చేసి ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వనున్నారు.

ఒత్తిడి తగ్గించుకోవడంపై 5న సదస్సు

కర్నూలు(హాస్పిటల్): ఒత్తిడిని తగ్గించుకోవడం ఎలా అనే అంశంపై ఈ నెల 5వ తేదిన అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో సీనియర్ సైకాలజిస్టు(గుంటూరు) డాక్టర్ ప్రత్యూష సుబ్బారావుచే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఆదోని పట్టణంలోని ద్వారకా ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ తెలిపారు. జిల్లా అధ్యక్షులు రామస్వామి అధ్యక్షన జరిగే సమావేశానికి ముఖ్య అతిథులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాయలసీమ జోనల్ ఇన్‌ఛార్జ్ విష్ణువర్ధన్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి సునీల్ దియోదర్, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ తదితరులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ జిల్లా పదాధికారులు, కార్యవర్గ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంస్థాగత విషయాలు, ప్రవాస్ యోజన సమీక్ష, రాబోవు సంస్థాగత కార్యక్రమాల గురించి చర్చించడం జరుగుతుందన్నారు.

నేడు ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కార్యవర్గ సమావేశం

కర్నూలు కల్చరల్:ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జరుగుతుందని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ వి.గిరికుమార్ రెడ్డి తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని భాగస్వామ్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

హార్మోనిస్టుకు ఆర్థిక సాయం



హార్మోనిస్టు వెంకటేశ్వర్లుకు ఆర్థిక సాయం చేస్తున్న టీజీ వెంకటేష్

కర్నూలు కల్చరల్: ఆర్థిక సమస్యల్లో ఉన్న కర్నూలు నగరానికి చెందిన ప్రముఖ హార్మోనిస్టు వెంకటేశ్వర్లుకు టీజీవీ కళాక్షేత్రం తరుపున ఆర్థిక సాయం చేశారు. గురువారం కళాక్షేత్రం గౌరవ అధ్యక్షులు మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ తన ఛాంబర్‌లో రూ.16వేలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరాణిక నాటకాలకు వెన్నుముక లాంటి వారు హార్మోనిస్టులన్నారు. కళా రంగానికి చేయూతను ఇస్తామన్నారు. నగరంలో ఉన్న వివిధ రంగాలకు చెందిన కళాకారుల జాబితా తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కోశాధికారి లక్ష్మీకాంతరావు, విశ్వసాహితీ అధ్యక్షులు గాండ్ల లక్ష్మన్న, హార్మోనిస్టు పాండురంగయ్య పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్ , వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు, మైఖేల్,రైటర్ పద్మభూషణం
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీర సింహారెడ్డి ,వాల్తేరు వీరయ్య, మెఖేల్, వారసుడు ,సువర్ణ సుందరి, రైటర్ పద్మభూషణం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య, మెఖేల్,రైటర్ పద్మభూషణం
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, పఠాన్, ది ఉమన్ కింగ్, రైటర్ పద్మభూషన్, రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం,బీటీఎస్ యెట్ టు కమ్ ఇన్ సినిమా
భరత్ కాంప్లెక్స్ : రెబెల్స్ ఆఫ్ తుపాకుల గూడెం , పఠాన్, సువర్ణ సుందరి
రాజ్ : తెగింపు
శ్రీరామ : ప్రేమదేశం
విజయ : పఠాన్

ప్రతి ఇంట్లో సంక్షేమ కాంతులు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 35వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ఉమామహేశ్వరనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రజలందరి ఇళ్లు కాంతులతో వెలుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం కల్లూరు అర్బన్ 35వ వార్డు 91వ వార్డు సచివాలయం పరిధిలోని ఉమామహేశ్వరమ్మ నగర్, ఫరూక్ నగర్‌లలో స్థానిక కార్పొరేటర్ సాపురు మాధురి, వార్డు ఇన్‌చార్జ్ సాపురు వీరయ్య ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీల్లో ప్రతి గడపను సందర్శిస్తూ ముందుకు సాగారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇంతవరకు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని ప్రజలకు వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి జగనన్న రాష్ట్రంలో అవినీతి రహితంగా జనరంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు. అర్హులైన వారికి పథకాలు నేరుగా ఇంటి వద్దకే వలంటీర్, సచివాలయ సిబ్బంది ద్వారా అందుతున్నాయన్నారు. గత టీడీపీ పాలనకు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ పాలనకు తేడా గమనించాలన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అసత్యా ప్రచారలు చేస్తున్నాయని, ప్రజలే వారికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, దండు లక్ష్మీకాంతరెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, లక్ష్మీరెడ్డి, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా పార్లమెంట్ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందెపోగు శివ, నాయకులు బాలచంద్రారెడ్డి, సత్యంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, జానకమ్మ, సుధాకర్‌రెడ్డి, శివ, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండు షాపులకే బహిరంగ వేలం

- 32 షాపులకు ముందుకు రాని పాటదారులు
- రెండవ రోజు రూ.15 లక్షల ఆదాయం



బహిరంగ వేలాన్ని పర్యవేక్షణ చేస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో రెండవ రోజు నిర్వహించిన బహిరంగ వేలానికి స్పందన కరువైంది. పాటదారుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న 40 మున్సిపల్ షాపులకు నిర్వహించిన బహిరంగ వేలంలో మొదటి రోజు పాటదారులు పోటీపడి ఆరు షాపులు దక్కించుకున్నారు. రెండవ రోజు గురువారం వేలంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొన్నారు. నగరపాలక సంస్థకు చెందిన సీ.క్యాంపు మున్సిపల్ కాంప్లెక్స్‌లోని 21-ఏ షాపును రూ.9 లక్షల 63 వేలకు స్థానిక శ్రీరామనగర్‌కు చెందిన పావనీ, అలాగే మద్దూరునగర్‌లో ఉన్న 17వ షాపును రూ.5 లక్షల 44 వేలకు స్థానిక జెఎస్ఆర్ నగర్‌కు చెందిన జి.పృథ్వీరాజ్ పాట పాడి దక్కించుకున్నారు. మిగతా 32 షాపులకు పాటదారుల నుంచి స్పందన రాలేదు. స్పందన లేకపోవడానికి షాపులు వాణిజ్యవ్యాపారాలకు అనువుగా లేవన్న అభిప్రాయం పాటదారుల నుంచి వ్యక్తం అవుతోంది. కాగా రెండవ రోజు నిర్వహించిన బహిరంగ వేలంలో నగరపాలకకు రూ.15 లక్షలు ఆదాయం సమకూరిందని రెవెన్యూ అధికారులు వెల్లడించారు.

ఇద్దరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు డివిజన్ల మార్పు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని 8వ డివిజన్‌లో పనిచేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజును 11వ డివిజన్‌కు కేటాయిస్తు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ పనిచేస్తున్న రమేష్‌ను తిరిగి 8వ డివిజన్‌కు మార్చారు. రెండున్నర నెలల క్రితం నగరంలో శానిటేషన్ మరింత మెరుగ్గా ఉండాలంటూ పలువురు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లకు స్థాన భ్రంశం కల్పించారు. మార్పులు చేసిన తరువాత శానిటేషన్ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా సాగుతోంది. ఇంతలోనే మరోసారి ఒకే ఒక్కరిని మాత్రం కమిషనర్ తిరిగి పాత డివిజన్‌కు కేటాయించారు. దీంతో మిగతా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తామేమి తప్పు చేశామని ప్రశ్నిస్తున్నారు. పర్యవేక్షణ అధికారి, శానిటేషన్ పరంగా ఉన్న మరొక అధికారి అలాగే ఉన్నత స్థాయిలో ద్వితీయ శ్రేణి అధికారికి కూడా తెలియకుండా ఈ వ్యవహారం నడిపించారన్న విమర్శలు ఉన్నాయి.

స్పాట్ బిల్లింగ్‌పై దృష్టి పెట్టండి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారీ విద్యుత్ బిల్లులు తీసే స్పాట్ బిల్లింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. గురువారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులు జారీ చేయడంలో ఎలాంటి సమస్య తలెత్తరాదని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి మీటర్‌ను డిజిటల్ యాప్ ద్వారా స్కాన్ చేసి రీడింగ్ చేయాలని చెప్పారు. డోర్ లాక్ బిల్లింగ్‌లో డోర్ లాక్ ఆప్షన్ ఉండేలా చూడాలని, మీటర్‌లో సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు సంబంధితన అధికారులు స్పందించాలన్నారు. బిల్లుల జారీ పూర్తయ్యాక బిల్లులు 100 శాతం రాబట్టాలన్నారు. దీనిపై ఆపరేషన్స్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు, ఏఈలు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకొని లక్ష్యం చేరాలన్నారు.పాత బిల్లులు, మొండి బకాయిలను ఎలాగైనా రాబట్టాలని, ప్రభుత్వ శాఖలకు ఎప్పటికప్పుడు ఆయా అధికారులతో మాట్లాడి వసూలు అయ్యేలా చూడాలని సూచించారు. అంతరాయం, ఇతర సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించి పునరుద్ధరించాలని సూచించారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిష్కారం చూపాలని, వీటిపై నిర్లక్ష్యం వహించడం తగదన్నారు.

తప్పిన పెను ప్రమాదం

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో పెను ప్రమాదం తప్పింది. గొల్లలదొడ్డి గ్రామ దారిలో ఉన్న గడ్డివాముల సమీపంలో గురువారం మధ్యాహ్నం ఉన్నట్టుండి గ్రామానికి చెందిన తెలుగు జకిరయ్యకు చెందిన ఖాళీ కల్లందొడ్డిలో చెత్తాచెదారం, ముళ్లకంపలకు మంటలు చెలరేగాయి. విషయాన్ని గమనించిన స్థానికులు గ్రామస్తులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా దాదాపు వందకు పైగా గడ్డివాములు ఉండే ప్రాంతంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో ప్రజలు ఆందోళనలు చెందారు. మంటలు అదుపులోకి రావడందో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదంలో ఆస్తినష్టం సంభవించలేదని స్థానికులు తెలిపారు. గ్రామ సర్పంచ్ పాండు రంగన్న, వీఆర్వో శేఖర్ స్థానికులతో కలిసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు.

'కార్పొరేట్లకు ఊడిగం చేసేలా కేంద్ర బడ్జెట్'



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్: కేంద్ర బడ్జెట్ గ్రామీణ ప్రజలను విస్మరించి, కార్పొరేట్లకు ఊడిగం చేసేలా ఉందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.నారాయణ విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ రైతాంగానికి సంబంధించిన ఎరువుల సబ్సిడీ ఊసే లేదన్నారు. వ్యవసాయ చట్టాలను రద్దు చేశారు కానీ కనీస మద్దతు ధర గురించి మాట్లాడలేదన్నారు. రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా స్పందించక పోవడం దారుణమన్నారు.కార్యక్రమంలో నాయకులు హుసేనయ్య, నరసింహులు, మధు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

డైట్ టెండర్లలో సాంకేతిక అంశాల పరిశీలన



టెండర్ల వ్యవహారం పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగులకు ఆహార సరఫరా(డైట్) టెండర్లకు సంబంధించి గురువారం అధికారులు సాంకేతిక అంశాలను(టెక్నికల్ బిడ్)ను పరిశీలించారు. టెండర్లకు మొత్తం 8 మంది కాంట్రాక్టర్లు దరఖాస్తు చేసుకోగా వారిని పిలిచి వారి ఎదురుగానే ధన్వంతరి హాలులో సాంకేతిక అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరెవరికి ఏఏ అర్హతలు ఉన్నాయనే వివరాలు సేకరించారు. ఈ మొత్తం వివరాలను జాయింట్ కలెక్టర్ రామసుందరరెడ్డికి నివేదించనున్నారు. శుక్రవారం టెండర్ వ్యవహారం ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు కల్చరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. గురువారం స్థానిక శంకరాస్ డిగ్రీ కళాశాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 'ఉన్నత లక్ష్యాల సాధన గ్రంథాలయాల ఆవశ్యకత ' అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎక్కువ సమయం పుస్తక పఠనానికి కేటాయించాలన్నారు. సెల్‌ఫోన్‌ల అధిక వాడకంతో చెడు వ్యసనాలకు బానిసలయ్యే ప్రమాదం ఉందన్నారు. అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్ గ్రంథాలయాల్లో అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మనాభరెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి శేషాద్రిరెడ్డి, రామలయక్ష్మయ్య, సహాయ గ్రంథాలయాధికారి గోవిందరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచండి

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కల్లూరు: ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు అధికారి అమర్‌నాథ్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. గురువారం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను క్షేత్ర పర్యటన చేసి పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడి మస్టర్లను తనిఖీ చేశారు. పూర్తి వేతనం పొందేలా ప్రభుత్వం నిర్దేశించిన కొలతల మేరకు పనులను చేసుకోవాలని కూలీలకు సూచించారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

- ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగభూషణం

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కర్నూలు ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం అన్నారు. 34వ రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం సాయంత్రం స్థానిక కర్నూలు-2డిపో గ్యారేజీలో డ్రైవర్లు, ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడా రు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సమష్టి కృషితోనే రోడ్డు ప్రమాదాల నివారణకు సాధ్యవుతుందని చెప్పారు. ప్రమాద రహిత ఆర్టీసీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, బస్సులు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రవాణ శాఖ ప్రాంతీయాధి కారి రమేష్ మాట్లాడుతూ బస్సు కండిషన్‌లో ఉంటే ప్రమాదాలకు అవకాశాలు తక్కువగా ఉంటాయని, ఏకాగ్రతతో బస్సులు నడపాలని సూచించారు. ప్రయాణికుల భద్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలను తప్పనిసరిగా పాటించిసురక్షితంగా గమ్య స్థానాన్ని చేర్చాలన్నారు. అనంతరం ప్రజా రవాణ శాఖ జిల్లాధికారి వెంకటరామం మాట్లాడుతూ డ్రైవర్ల విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించరాదన్నారు. ఇంటి వద్ద జరిగిన కుటుంబ, ఇతర సమస్యలను బస్సె క్కె ముందు మర్చిపోయి మానసిక ఉల్లాసం, ఏకాగ్రతతో బస్సు నడపాలన్నారు. ఉద్యోగులు మద్యపానం, గుట్కా వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం ప్రమాద రహిత డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీటీఎం రమణ, డీసీఎంఈ రజియా సుల్తానా, తెలుగు అధ్యాపకులు అన్వర్ హుసేన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

కర్నూలు: ట్రాఫిక్ నియమాలపై పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ విద్యార్థులకు గురువారం ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ముఖ్య అతిథిగా హాజరై మా ట్లాడారు. లైసెన్స్ లేకుండా విద్యార్థులు వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులైతే కేసుల్లో ఇరుక్కుని ప్రభుత్వ ఉద్యోగాలకు దూరమవుతారని హెచ్చరించారు. స్నేక్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, అతి వేగంగా వాహ నం నడపడం చేయకూడదన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే విద్యార్థులకు కళాశాలల్లో అనుమతించొద్దని యాజమాన్యాలకు సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారి ప్రవీణ్‌కుమార్

కల్లూరు: వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నప్పుడు వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం కల్లూరు మండలం ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలికాలంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు చలికాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్ల పక్కన ఉన్న ఆహారాన్ని, చిరుతిండ్లను, జంక్ ఫుడ్‌ను తీసుకుంటే అనారోగ్యానికి గురవుతారని హెచ్చరించారు. ఇంట్లో చేసిన ఆహారాన్ని తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని, వేడివేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉల్లిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఎంపీహెచ్ఈఓ సుబ్బారాయుడు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు ఏర్పాటుకు స్థల పరిశీలన



పార్కు ఏర్పాటుపై జెడ్పీటీసీ, ఎంపీడీఓతో చర్చిస్తున్న కుడా ఇంజనీర్, ప్లానింగ్ సిబ్బంది

కోడుమూరు రూరల్: కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ ఆధ్వర్యంలో కోడుమూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పార్కును ఏర్పాటు చేసేందుకై కుడా డీఈఈ నాజీర్ అహమ్మద్, ప్లానింగ్ ఆఫీసర్లు సంధ్య, విజయభాస్కర్, రాజేష్‌లు గురువారం స్థలాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో పార్కును ఏర్పాటు చేయాలంటూ గతంలో జెడ్పీటీసీ రఘునాథరెడ్డి ప్రతిపాదనలు పంపించడంతో, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి సూచన మేరకు, కుడా సిబ్బంది స్థలాన్ని పరిశీలించారు. అనంతరం వారు జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, గ్రామ సచివాలయ ఇంజినీర్లతో పార్కు అభివృద్ధి చేసేందుకు అవసరమైన స్థలం యొక్క వివరాలను తెలుసుకున్నారు.

ఆసుపత్రికెళ్లి పింఛన్ పంపిణీ



రామలక్ష్మమ్మకు పింఛన్ సొమ్ము అందిస్తున్న వలంటీరు సుభాషిణి

గడివేముల: కాలికి గాయం కావడంతో నంద్యాల సమీపంలోని శాంతిరాం ఆసుపత్రిలో చిందుకూరు గ్రామానికి చెందిన రామలక్ష్మమ్మ చికిత్స పొందుతోంది. ఆమె ఫిబ్రవరి నెల పింఛన్ సొమ్ము తీసుకోలేని పరిస్థితిలో ఉంది. విషయం తెలుసుకున్న చిందుకూరు వలంటీరు సుభాషిణి సొంత ఖర్చులతో గురువారం ఆసుపత్రికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించింది. దీంతో వలంటీరును పలువురు అభినందించారు.



హనుమంతుకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ భార్గవి, సచివాలయ కన్వీనర్ వెంకటేష్

గూడూరు రూరల్: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో రెండవ రోజు గురువారం కూడా వలంటీర్లు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగించారు. తెల్లవారు జాము నుంచే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. మండల వ్యాప్తంగా 3,200 మంది లబ్ధిదారులు ఉండగా రెండు రోజుల్లో 90 శాతం పింఛన్ పంపిణీ చేశామని, మిగిలిన వారికి కూడా శుక్రవారం అందిస్తామని ఎంపీడీఓ మాధవీలత తెలిపారు.

శివాలయ నిర్మాణానికి భూమిపూజ



శివాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 38వ వార్డు మాసమసీదు గ్రామంలో నూతనంగా శివాలయం నిర్మాణానికి గురువారం ఉదయం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కర్నూలు నగర పాలక సంస్థ 38వ వార్డు కార్పొరేటర్ గిప్సన్, 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, మాసమసీదు గ్రామ పెద్దలు జయచంద్ర, తిరుమలరావు, శివస్వాముల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాసమసీదు గ్రామ పెద్దలు, ప్రజలందరి సహకారంతో శివాలయ నిర్మాణం చేపట్టడం ఎంతో శుభపరిణామమన్నారు. మహాశివుని చల్లని దీవెనలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు కరీముల్లా, కిరణ్, శివస్వాములు, మాసమసీదు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు

కర్నూలు కల్చరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి రీసర్వే, భూసేకరణ, వ్యవసాయం, హౌసింగ్ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ భూసేకరణ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి పెండింగ్ పీఎంఏవై గ్రామీణ్ రిజిస్ట్రేషన్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పూర్తి అయిన ఇళ్ల నిర్మాణాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో జేసీ రామసుందర్‌రెడ్డి, కర్నూలు నగర పాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు



గడిగరేవులలో జొన్న పంట సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

గడివేముల: పంటలను సాగు చేసే ముందు విత్తన శుద్ధి చేయడంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని నంద్యాల వ్యవసాయ శాస్త్రవేత్తలు నరసింహా, అరుణ్‌కుమార్‌లు తెలిపారు. గురువారం మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల ఏడీఏ రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆముదం, జొన్న పంటలలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. చిరుధాన్యాలు సాగు చేస్తే మంచి దిగుబడి ఉంటుందన్నారు. మినుము పంటలో రసం పీల్చేపరుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రైతులు సస్యరక్షణ చర్యలతో పాటు వ్యవసాయాధికారులు సలహాలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ హేమసుందర్‌రెడ్డి, సర్పంచ్ రామ్మోహన్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠ

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో శుక్రవారం శ్రీ చింతలముని స్వామి, శ్రీనల్లారెడ్డి స్వాముల వారి నూతన విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ పాండురంగన్న తెలిపారు. గ్రామంలోని దాసరి వీధిలో వెలసిన స్వాముల వారి ఆలయ పునఃనిర్మాణం నేపథ్యంలో ఆలయ శిఖర స్థాపన, స్వాముల వారి నూతన విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్నట్లు చెప్పారు. గురువారం విగ్రహాలకు గ్రామోత్సవం, శాంతి, నవగ్రహ హోమాలు నిర్వహించారు. నేడు బ్రహ్మశ్రీ ములుకుంట్ల ఆంజనేయశర్మ అధ్యక్షతన వివిధ పూజా కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించనున్నట్లు పురోహిత

మురుగునీటితో ఇబ్బందులు



టీబీసీడీ వార్డులోని బాత్‌రూమ్‌లో నిలిచిన మురుగునీరు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పలు విభాగాల్లో మురుగునీటితో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలోని టీబీసీడీ, ఫిమేల్ మెడికల్ వార్డులలోని బాత్‌రూమ్‌లలో బయటి నుంచి మురుగునీరు వస్తోంది. ఆయా వార్డుల వెనుకవైపున ఉన్న మురుగునీటి సంప్‌లు పాడై నీరు బయటకు వస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నీరే ఆయా వార్డుల్లోకి వస్తుండటంతో అందులోని రోగులు దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఆయా వార్డుల్లోని బాత్‌రూమ్‌లను అధికారులు మూసివేసి మరమ్మతులు చేస్తున్నారు. రోగులు ఇతర వార్డుల్లోని బాత్‌రూమ్‌లను వాడుకునే విధంగా తాత్కాలిక ఏర్పాట్లు చేశారు.